సాక్షి
ఒడిశా
శనివారం । 17 । ఆగస్టు । 2024


శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ.6,21,360
బంగారం : 780 మిల్లీ గ్రాములు
వెండి : 28 గ్రాముల 380 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ

వరములివ్వు తల్లి.. వరలక్ష్మీ

శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా తెలుగు లోగిళ్లు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.


- 8లో.



హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

పాఠాలు బోధించాల్సిన ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో సస్పెన్షన్ వేటుకు గురైన సంఘటన వెలుగు చూసింది.

- 8లో.



న్యూస్‌రీల్

రాజ్‌భవన్‌లో ఎట్ హోమ్


స్వాతంత్య్ర సమరయోధులతో మాట్లాడుతున్న గవర్నర్ రఘుబర్ దాస్

భువనేశ్వర్: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ రఘుబర్ దాస్ 'ఎట్ హోమ్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఒరిస్సా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, స్వాతంత్య్ర సమరయోధులు సహా సమాజంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

డీజీపీగా ఖురానియా


యోగేష్ బహదూర్ ఖురానియా

భువనేశ్వర్: రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసుగా యోగేష్ బహదూర్ ఖురానియా బాధ్యతలు చేపట్టారు. యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) డీజీపీ పదవికి సంబంధించి ముగ్గురు ఐపీఎస్ అధికారుల పేర్లను సిఫార్సు చేసింది. వీరిలో ఒడిశా ప్రభుత్వం శుక్రవారం 1990 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ వై.బి.ఖురానియాను డీజీపీ మరియు పోలీసు విభాగం ప్రముఖునిగా (హెచ్‌ఓపీఎఫ్)గా నియమించింది. 2018 నుంచి అతను సెంట్రల్ డిప్యుటేషన్‌లో ఉన్నారు. ఇటీవల రాష్ట్రానికి తిరిగి వచ్చారు. ఈ వ్యవధిలో అతను సరిహద్దు భద్రతా దళం (బీఎస్‌ఎఫ్) ప్రత్యేక డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహించారు. లోగడ రాష్ట్రంలో నయాగఢ్, జాజ్‌పూర్, రౌర్కెలా, మయూర్‌భంజ్, గంజాం జిల్లాలకు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పని చేశారు. దక్షిణ శ్రేణి – ఉత్తర శ్రేణి డీఐజీ, భువనేశ్వర్ – కటక్ జంట నగరాల కమిషనరేట్‌లో అదనపు పోలీసు కమిషనర్, పోలీస్ కమిషనర్‌గా కూడా పనిచేశారు. అతను బిజూ పట్నాయక్ రాష్ట్ర పోలీసు అకాడెమీ డైరెక్టర్ కమ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ట్రైనింగ్)గా సైతం బాధ్యతలు నిర్వహించారు.

ఎట్టకేలకు..!

• ఖల్లికోట్ వర్సిటీకి యూజీసీ గుర్తింపు



భువనేశ్వర్: ఎట్టకేలకు రాష్ట్రంలో ప్రాచీన విద్యా సంస్థ ఖల్లికోట్ విశ్వ విద్యాలయానికి యూజీసీ గుర్తింపు లభించింది. 10,000 మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి తెర తొలగిపోయింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఒడిశాలోని పురాతన విద్యాసంస్థల్లో ఒకటైన ఖల్లికోట్ ఏకీకృత (యూనిటరీ) యూనివర్సిటీకి గుర్తింపునివ్వడం విశేషం. ఈ విశ్వవిద్యాలయం ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల జాబితాలో స్థానం సాధించింది. యూజీసీ నుంచి యూనివర్సిటీకి గుర్తింపు లేఖ అందిందని ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గీతాంజలి దాస్ తెలిపారు. ఈ గుర్తింపు వర్సిటీ నుంచి గ్రాడ్యుయేట్ చేసినవారితో సహా విద్యార్థులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు.

147 ఏళ్ల చరిత్ర

147 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ సంస్థ 1856లో జిల్లా పాఠశాలగా ప్రారంభమైంది. విద్యారంగంలో ఈ సంస్థ పలు ఒడిదుడుకులకు ఎదురీది కాలానుగుణంగా ఎదుగుదలని చవిచూసింది. ఖల్లికోట్ స్వయం ప్రతిపత్త కళాశాలగా అభివృద్ధి సాధించింది. తర్వాత దశల్లో ఖల్లికోట్ క్లస్టర్ విశ్వవిద్యాలయం, ఖల్లికోట్ పరిశోధన ఇంటెన్సివ్ యూనివర్సిటీ, ఖల్లికోట్ యూనివర్సిటీగా ఎదుగుదలకు నిలువుటద్దంగా నిలిచి తాజాగా యూజీసీ నుంచి ఖల్లికోట్ యూనిటరీ యూనివర్సిటీగా గుర్తింపు సాధించింది. 2015 మరియు 2021 మధ్య ఆరు సంవత్సరాల కంటే తక్కువ వ్యవధిలో స్వయం ప్రతిపత్తి కళాశాల నుంచి ఏకీకృత విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెందింది. ఆరేళ్ల స్వల్ప నిడివిలో ఈ పరివర్తన స్థితిపై యూజీసీ గందరగోళానికి గురయ్యింది. దీని కారణంగా ఇది డీ-అఫిలియేట్ చేయబడడంతో గుర్తింపు కోసం నిరీక్షించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఖల్లికోట్ యూనిటరీ యూనివర్సిటీలో 5,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. 2021లో యూజీసీ గుర్తింపును నిలిపివేసిన తర్వాత సంస్థ నుంచి రెండు బ్యాచ్‌లు పట్టభద్రులయ్యారని ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ గీతాంజలి దాస్ తెలిపారు.

సమర శంఖారావం..!

• బీజేడీ అవగాహన యాత్ర ప్రారంభం
• బీజేపీ వైఫల్యాలపై ప్రజల ముందుకు
• నవీన వ్యూహంతో కదలిక
• పూర్వ వైభవం కోసం ఆరాటం





భువనేశ్వర్: రాష్ట్రంలో తొలిసారిగా పాలన పగ్గాలు చేపట్టిన బీజేపీ సర్కార్ రాష్ట్ర ప్రజలను మోసగిస్తోందనే నినాదంతో విపక్ష బిజూ జనతా దళ్ అవగాహన యాత్రకు శంఖారావం చేసింది. ప్రధానంగా వృద్ధాప్య పింఛన్ పథకానికి సంబంధించి బీజేడీ తీవ్రస్థాయిలో మండిపడుతోంది. ఈ నేపథ్యంలో ముందస్తు నిర్ణయం ప్రకారం శుక్రవారం నుంచి బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. వారం రోజులపాటు ఈ అవగాహన ప్రచార కార్యక్రమం కొనసాగుతుంది. వృద్ధాప్య పింఛన్ పథకంపై బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

పంచాయతీల్లో పర్యటన

రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రాష్ట్రవ్యాప్త ప్రచారాన్ని బీజేడీ ప్రారంభించింది. వృద్ధుల హక్కుల పరిరక్షణ బీజేడీ పోరాట లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ పోరాటంలో పార్టీ కార్యకర్తలు, చైతన్యవంతమైన పౌరులు అందరూ ప్రచారంలో పాల్గొని బీజేపీ ద్రోహంపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని విపక్ష నేత నవీన్ అన్నారు.

వ్యూహాత్మకంగా

సుదీర్ఘంగా 24 ఏళ్ల పాటు రాష్ట్రంలో బిజూ జనతా దళ్ నిరవధికంగా అధికారంలో కొనసాగింది. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒక్కసారిగా కుప్పకూలింది. అధికారం నుంచి విపక్ష హోదాకు దిగజారింది. ఈ విపత్తు నుంచి కోలుకోలేని దయనీయ స్థితితో బీజేడీ వర్గీయులు డీలాపడ్డారు. ఈ బలహీనతని అధికారంలోకి వచ్చిన బీజేపీ సొమ్ము చేసుకునే ప్రయత్నంలో పావులు కదుపుతోంది. విభజన పాలన ప్రాతిపదికన బీజేడీ అనుచరులను తన గూటికి రప్పించుకునే ప్రయత్నాల్లో ఫలప్రదం అవుతున్న సంకేతాలు ఇటీవల స్పష్టం అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో బీజేడీ దుర్గం ఏమాత్రం బీటలు వారకూడదనే దృఢ సంకల్పంతో అధినేత నవీన్ పట్నాయక్ కొత్తబలం కోసం లోతైన వ్యూహంతో ప్రత్యక్షంగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

విద్యార్థి సంఘం ఎన్నికలు

బీజేడీ పాలనలో దీర్ఘకాలంగా విద్యార్థి సంఘం ఎన్నికలు నిలిచిపోయాయి. 2018 నుంచి కళాశాలల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు జరగలేదు. ఈ పరిస్థితిపై విద్యార్థి మరియు యువజన వర్గాల్లో అసంతృప్తి నెలకొంది. కొత్త ప్రభుత్వం విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించే యోచనతో ఉరకలేస్తోంది. ఈ యోచన కార్యాచరణకు ముందే అసంతృప్తి వర్గాల బుజ్జగింపు ముగించేందుకు తాజా అవగాహన యాత్ర దోహదపడుతుందని బీజేడీ భావిస్తోంది. విద్యార్థి, యువతరం మద్దతుతో అతిత్వరలో పూర్వ వైభవంతో తళుక్కుమనిపించాలనే నవీన్ వ్యూహం ఎలా పని చేస్తుందో వేచి చూడాల్సిందే.

అట్టడుగు వర్గాలతో భేటీ

అధికార కాలంలో అట్టడుగు స్థాయి వర్గాలతో నవీన్ పట్నాయక్ ప్రత్యక్ష సంప్రదింపులు నామమాత్రమే. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ప్రత్యక్షంగా రంగంలోకి దిగి అట్టడుగు స్థాయి నుంచి అన్ని వర్గాల ప్రజలు, కార్యకర్తలతో సత్సంబంధాల్ని బలపరచుకోవాలనే దృక్పథం బీజేడీ శ్రేణుల్లో ప్రేరేపిస్తున్నారు. గ్రామాలు, పంచాయతీ, మండల స్థాయి నుంచి పట్టణ, నగర స్థాయి వరకు నమ్మకం, విశ్వాసం కూడగట్టుకునే ప్రయత్నంలో బీజేడీ సాఫల్యతపై రాజకీయ వర్గాలు కన్నేసి ఉంచాయి.

పంచాయతీల్లో ఎన్నికలు

సార్వత్రిక ఎన్నికల్లో కుప్పకూలినా పంచాయతీ ఎన్నికల్లో తన ఉనికిని తేజోవంతంగా ప్రదర్శించేందుకు తాజా అవగాహన ప్రచార కారక్రమం సరికొత్త అంకురార్పణ. బీజేడీ పూర్వ వైభవం కళంకితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ పంచాయతీలో తన వర్గీయుల్లో మానసిక స్థైర్యం ప్రేరేపించి సత్తా చాటుకునే పంచాయతీ పోరు వ్యూహం ఇది. అధికార హోదా నుంచి విపక్ష హోదాకు దిగజారిన పరిస్థితిని మరోసారి పూర్వస్థాయికి పునరుద్ధరించేందుకు నవీన్ పట్నాయక్ గ్రామం నుంచి అవగాహనని బలపరచనున్నారు. వృద్ధాప్య పింఛన్ వంటి సాంఘిక భద్రత, సంక్షేమ పథకాల అమలు, కార్యాచరణలో అధికార బీజేపీ మోసపూరిత వైఖరిని ఎండగడితే బీజేడీ శిబిరం పదిలం కావడంతో పాటు పంచాయతీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలకు మార్గం సగమమవుతుందని భావిస్తోంది. మరో రెండేళ్లలో ఈ ఎన్నికలు జరగనున్నాయి.

ఓడ స్వాధీనానికి ఆదేశాలు


పారాదీప్ ఓడ రేవులో నౌక

భువనేశ్వర్: సముద్ర ద్రవ్య వివాదానికి సంబంధించి ఒరిస్సా హైకోర్టు ఆదేశాల మేరకు జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్ ఓడరేవులో ఈజిప్ట్ ఫ్లాగ్‌షిప్ కింద ప్రయాణించే బల్క్ క్యారియర్‌ను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాల మేరకు పారాదీప్ పోర్ట్ అథారిటీ (పీపీఏ) స్థానిక పోలీసుల సమక్షంలో ఓడను అదుపులోకి తీసుకుంది. తదుపరి ఆదేశాలు జారీ అయ్యేంతవరకు ఈ ఉత్తర్వులు కొనసాగుతాయని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ఇటీవల ఇటువంటి వివాదంతో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన చైనా నౌకకు నిర్బంధించారు. తక్కువ సల్ఫర్ మెరైన్ గ్యాస్ ఆయిల్ డెలివరీపై జర్మన్ కంపెనీకి మరియు ఓడ యజమానికి మధ్య జరిగిన వివాదం ఫలితంగా ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలిసింది. ఈజిప్ట్ నౌక ఎంవీ వాడీ అల్బోస్టాన్ ఈనెల 6న పారాదీప్‌కు చేరుకుంది. ఇది బంగ్లాదేశ్ నుంచి బయల్దేరి 55,000 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని తీసుకుని చైనాకు వెళ్తున్నట్లు సమాచారం. అయితే ఈ సమయంలో ఒక జర్మన్ కంపెనీ, ఓడ యజమాని నుంచి సుమారు రూ.4 కోట్లను క్లెయిమ్ చేసి ఒరిస్సా హైకోర్టును ఆశ్రయించింది. దీంతో హైకోర్టు బల్క్ క్యారియర్‌ను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించింది. అరెస్ట్ వారెంట్‌ను అమలు చేయడానికి కుజంగ్ సబ్-జడ్జిని మార్షల్‌గా నియమించింది. మార్షల్ హోదాలో అధికారాలు కలిగిన కుజంగ్ సబ్ జడ్జి, స్థానిక మరియు పారాదీప్ మెరైన్ పోలీసులతో కలిసి పారాదీప్ పోర్ట్ నుంచి బయలుదేరకుండా ఓడను పట్టుకున్నారు.

బీఎంసీ పరిధిలోకి ఎయిమ్స్ క్యాంపస్


వాజ్‌పేయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

భువనేశ్వర్: స్థానిక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) క్యాంపస్ భువనేశ్వర్ నగర పాలక సంస్థ పరిధిలోకి తీసుకురానున్నట్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తెలిపారు. ఈ ప్రతిపాదనపై ఎయిమ్స్ డైరెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ చర్యతో క్యాంపస్ చక్కని పారిశుద్ధ్య పరిరక్షణతో ఆరోగ్యవంతమైన తీర్చిదిద్దవచ్చన్నారు. ఎయిమ్స్ క్యాంపస్ బీఎంసీ పరిధిలోకి వస్తే పారిశుద్ధ్యం మెరుగ్గా ఉంటుందని ఎయిమ్స్ డైరెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. భారత దివంగత ప్రధానమంత్రి భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి పురస్కరించుకుని శుక్రవారం ఈ ప్రకటన చేశారు. ఎయిమ్స్ క్యాంపస్ ఆవరణలో అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహం దగ్గర రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ఆధ్వర్యంలో ప్రముఖుల బృందం శ్రద్ధాంజలి ఘటించింది.

ఎమ్మెల్యేల శిక్షణకు బీజేడీ దూరం

• స్పీకర్‌కు ప్రతిపక్ష చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ లేఖ

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న విషయం తెలిసిందే. పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలంతా పాల్గొనాలని పిలుపునిచ్చింది. శని, ఆదివారాల్లో వరుసగా 2 రోజుల పాటు ఎమ్మెల్యేల శిక్షణా కార్యక్రమం ఖరారు చేశారు. అయితే సభా మర్యాదలకు భంగం సాకుగా చూపుతూ బిజూ జనతా దళ్ ఎమ్మెల్యేలు హాజరవ్వడం లేదని ప్రకటించారు. ఈ మేరకు బీజేడీ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ శాసన సభ స్పీకర్‌కు లేఖ రాసి ఈ విషయం స్పష్టం చేశారు. శాసనసభ సభ్యుల శిక్షణా కార్యక్రమం ప్రారంభోత్సవం పురస్కరించుకుని సభా ప్రాంగణంలో ఎమ్మెల్యేలను ఉద్దేశించి ప్రసంగించేందుకు కేంద్రమంత్రిని ఆహ్వానించడం సభ గౌరవాన్ని, సమగ్రతను దెబ్బతీస్తుందని లేఖలో పేర్కొన్నారు. ఈ కారణంగా తాము శిక్షణలో పాల్గొనకూడదని నిర్ణయించుకున్నామని పేర్కొన్నారు. సభా నాయకుడిగా ఉన్న ముఖ్యమంత్రిని కేంద్రమంత్రి సమక్షంలో ద్వితీయ స్థానానికి దిగజార్చడంపై బీజేడీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది సభా మర్యాదలను ఉల్లంఘించడమే కాకుండా రాష్ట్రంలో ముఖ్యమంత్రిని అగౌరవపరచడం అవుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో కేంద్రమంత్రుల కంటే ముఖ్యమంత్రి ముందుండాలని పేర్కొన్నారు. అలా కాకుండా సొంత రాష్ట్రంలో ముఖ్యమంత్రి గౌరవాన్ని దెబ్బతీసే రీతిలో సభలో ఎమ్మెల్యేల శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ధ్వజమెత్తారు. ఒడిశా శాసనసభ మరియు దాని నాయకుడి గౌరవం, హుందాతనం, సమగ్రతను కాపాడుకోవాల్సిన అవసరాన్ని విపక్ష బిజూ జనతా దళ్ నొక్కి చెబుతోందన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా బీజేడీ ఎమ్మెల్యేలు శిక్షణా కార్యక్రమానికి హాజరుకావడం లేదని తెలియజేశారు.

అతిథుల జాబితా నుంచి తొలగింపు

ఎమ్మెల్యేలకు శిక్షణా కార్యక్రమంలో అతిథుల జాబితా నుంచి కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, జె.పి.నడ్డా పేర్లు తొలగించారు. తాజా సవరణ ప్రకారం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఓరియంటేషన్ కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభం కానుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాల్సి ఉండగా, ఆరోగ్య మంత్రి మరియు బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా ఈ వేడుకలో ప్రసంగిస్తారని లోగడ ప్రకటించారు. బిజూ జనతా దళ్ మరియు కాంగ్రెస్ నుంచి వ్యతిరేకత బలం పుంజుకోవడంతో అతిథి జాబితా సవరించడం అనివార్యమైంది. సవరించిన కార్యక్రమం ప్రకారం కేంద్రమంత్రి కిరణ్ రిజిజు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాజ్యసభ డిప్యూటీ చైర్‌పర్సన్ హరివంశ్ ప్రసంగిస్తారు. కొత్త ఎమ్మెల్యేల శిక్షణ కోసం ఉద్దేశించిన కార్యక్రమం ప్రారంభ రోజు శనివారం జరిగే కార్యక్రమానికి రాష్ట్ర శాసన సభ స్పీకర్ సురమా పాఢి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్, డిప్యూటీ స్పీకర్ భవానీ శంకర్ భోయ్ మరియు మంత్రి ముఖేష్ మహాలింగ్ హాజరుకానున్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి జుయల్ ఓరమ్, బీజేపీ ఎంపీ భర్తృహరి మహతాబ్, మాజీ ఆర్థిక మంత్రి ప్రఫుల్ల చంద్ర ఘొడై, రణేంద్ర ప్రతాప్ స్వంయి, నరసింగ మిశ్రా ప్రసంగించనున్నారు. ప్రస్తుత అసెంబ్లీలో 84 మంది తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో 54 మంది బీజేపీ, 18 మంది బీజేడీ, 9 మంది కాంగ్రెస్‌కు చెందిన వారు కాగా, 3 మంది స్వతంత్ర శాసన సభ్యులు ఉన్నారు.

భారీ అలుగు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న అలుగు

కొరాపుట్: స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) దాడుల్లో భారీ అలుగు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నుంచి ఎస్‌టీఎఫ్ బృందం కొరాపుట్ జిల్లాకి శుక్రవారం చేరుకుంది. సిమిలిగుడ ప్రాంతంలో భారీ అలుగుని అక్రమ రవాణా చేస్తున్నరనే సమాచారంతో దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా ఒక ఆల్టో కారులో తనిఖీలు చేయగా అలుగు పట్టుబడింది. దీనిని రవాణా చేస్తున్న స్మగ్లర్లు సిమిలిగుడకి చెందిన సదా ధిశారి, లందు టంగుడు, పొట్టంగికి చెందిన ముఖేష్ ఖొరాలను అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ దాడుల్లో ఎస్‌టీఎఫ్‌కి కొరాపుట్ జిల్లా పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది సహకరించారు. దాడి అనంతరం అలుగుతో పాటు నిందితులను భువనేశ్వర్ తీసుకెళ్లి కోర్టులో హాజరుపరిచారు.

• విజిలెన్స్ దాడులు

భువనేశ్వర్: కేంద్రాపడా అదనపు పౌరసరఫరాల అధికారి ప్రదీప్ కుమార్ మహాపాత్రోకు సంబంధించిన ఆస్తులపై విజిలెన్స్ దాడులు జరిగాయి. ఆయన ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో కటక్, భువనేశ్వర్, కేంద్రాపడా తదితర 5 ప్రదేశాల్లో అధికారులు శుక్రవారం ఏకకాలంలో సోదాలు ప్రారంభించారు. కటక్‌లోని ప్రత్యేక విజిలెన్స్ జడ్జి జారీ చేసిన సెర్చ్ వారెంట్ల ఆధారంగా నలుగురు డీఎస్పీలు, 1 అసిస్టెంట్ కమాండెంట్, ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు, ఇతర సహాయక సిబ్బంది నేతృత్వంలో సోదాలు చేపట్టారు. స్థానిక లింగిపూర్‌లో రెండంతస్తుల భవనం, కటక్ మధుపట్నలోని కల్యాణి నగర్‌లో మరొకటి సహా ఇతర ప్రాంతాల్లో అతనికి రెండు భవనాలు ఉన్నట్లు విజిలెన్స్ విభాగం నిర్వహించిన సోదాల్లో ఇప్పటివరకు వెల్లడైంది. అదనంగా అతనికి రెండు ఇళ్ల స్థలాలు ఒకటి భువనేశ్వర్‌లోని లింగిపూర్‌లో మరియు మరొకటి కటక్‌లోని కల్యాణి నగర్‌లో ఉన్నాయి.

ఈ సోదాల్లో దాదాపు రూ.1 కోటి విలువ చేసే మ్యూచువల్ ఫండ్ డిపాజిట్లు బయటపడ్డాయి. అదేవిధంగా రూ.1.21 లక్షల నగదు, ఒక ఫోర్-వీలర్ (మారుతి స్విఫ్ట్), రెండు ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. భారతీయ స్టేట్ బ్యాంకు కటక్ మెయిన్ బ్రాంచిలో అతని భార్య పేరుతో నిర్వహిస్తున్న బ్యాంక్ లాకర్ తెరవాల్సి ఉందని విజిలెన్సు అధికార వర్గాలు తెలిపాయి. సోదాలు కొనసాగుతున్నందున మరిన్ని ఆస్తులు బయటపడవచ్చని భావిస్తున్నారు.

• విధేయత


చదువుల తల్లి కొలువుదీరిన పాఠశాల ముంగిట రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి విధేయత చాటుకున్నారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని భవానీపట్న గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తన బాల్యంలో 1 నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక విద్యాభ్యాసం పొందిన పాఠశాలకు వెళ్లారు. కృతజ్ఞత పూర్వకంగా పాఠశాల ఆవరణలో మోకాలిపై కూర్చొని ఇలా నమస్కరించారు. – భువనేశ్వర్

బీజేపీ గూటికి కొండబాబు

• ఆయనతో పాటు 400 మంది చేరిక
• రాయగడలో బీజేడీకి దెబ్బ


బీజేపీ పెద్దల సమక్షంలో చేరిన కొండబాబు తదితరులు

రాయగడ: బీజేడీ సీనియర్ నాయకుడు ఎల్ల కొండబాబు అతని అనుచరులు బీజేపీ గూటికి చేరారు. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని బీజేపీ కార్యాలయంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఆ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు మన్మోహన్ సామల్, మాజీ అధ్యక్షుడు సమీర్ మహంతి వంటి ప్రముఖుల సమక్షంలో కొండబాబు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. గత నాలుగు దశాబ్దాలుగా బీజేడీలో క్రియాశీలక పాత్ర పోషించిన కొండబాబు బీజేడీ వదిలి బీజేపీలో చేరడంతో ఆ పార్టీకి పెద్ద షాక్ తగిలింది. రాజ్యసభ మాజీ సభ్యుడు, బీజేడీ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న నెక్కంటి భాస్కరరావుకు, అతనికి అత్యంత సన్నిహితుడిగా వ్యవహరించిన కొండబాబుకు మధ్య గత మున్సిపాలిటీ ఎన్నికల నుంచి విభేదాలు నెలకొన్నాయి. దీంతో కొండబాబు అతనికి దూరమయ్యారు. స్థానిక రింగర్ రోడ్డులో బీజేడీ కార్యకర్తల కార్యాలయాన్ని ప్రారంభించి తన ప్రత్యేకతను సంపాదించుకునేందుకు విశ్వప్రయత్నం చేశారు. బీజేడీ పార్టీలోనే ఉంటూ వివిధ కార్యక్రమాలను కొనసాగిస్తుండేవారు.

బీజేడీ బహిష్కరణ

గత సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై కొండబాబును అధిష్ఠానం పార్టీ నుంచి బహిష్కరించింది. అయినప్పటికీ ఎన్నికల్లో బీజేడీ పార్టీ కార్యకలాపాల్లో, ప్రచారాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఒకవైపు అధిష్ఠానం పార్టీ నుంచి బహిష్కరించినప్పటికీ తాను మాత్రం పార్టీ విజయానికి, పార్టీపై ఉన్న అభిమానంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని కొండబాబు బాహాటంగా చెప్పుకున్నారు. ఏదిఏమైనప్పటికీ రాష్ట్రంలో రాజకీయ మార్పులు చోటుచేసుకోవడంతో పాటు అధికారంలోకి బీజేపీ రావడంతో ఆ పార్టీలోకి చేరేందుకు సీనియర్ నాయకులతో మంతనాలు కొనసాగించారు. అనంతరం ఆ పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఆయనతో పాటు ఆయన మద్దతుదారులైన సుమారు నాలుగు వందల మంది అధికారికంగా బీజేపీ కండువా కప్పుకున్నారు.

బీజేపీని బలపరుస్తాం

బీజేపీ తీర్థం పుచ్చుకున్న కొండబాబు ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. రాయగడ జిల్లాలో బీజేపీని బలోపేతం చేస్తామని తెలియజేశారు. త్వరలో పార్టీ తరుపున విస్తృతంగా కార్యకలాపాలను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. జిల్లాలో మనుగడ లేని బీజేడీపై తన పోరాటం కొనసాగించి సత్తా చాటుకుంటానని పేర్కొన్నారు. ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో మాత్రమే పార్టీ మారాల్సిన పరిస్థితి ఎదురైందన్నారు. బీజేడీలో చేరినవారిలో రాయగడ జిల్లా డొంబ్ సమాజం అధ్యక్షుడు ధనిరాం నాయక్, మాజీ అధ్యక్షుడు నరేంద్ర నాయక్, ఆదివాసీ సమాజం జిల్లా అధ్యక్షుడు చక్రధర్ బిడిక, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బిరజా పాత్రో, పార్టీ సీనియర్ కార్యకర్తలు కృష్ణచంద్ర పట్నాయక్, డి.పృథ్వీరాజ్, ఎం.నిర్మల్‌రావు, బి.రఘురాం, మిన్నారావు హిమిరిక, కమల్ సావుంతా తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ ఒడియా చిత్రంగా దొమెనొ

భువనేశ్వర్: బాబూషాన్ మహంతి నటించిన దొమెనొ చిత్రం 2022 సంవత్సరానికి 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ ఒడియా చిత్రంగా ఎంపికైంది. జేపీ మోషన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రానికి విశాల్ మౌర్య, దేబీ ప్రసాద్ లెంకా దర్శకత్వం వహించారు. ఒడిశాలోని మారుమూల ప్రాంతాల్లో మలేరియా కేసులను తగ్గించడంలో సహాయపడిన నిర్భయ యువ వైద్యుడి స్ఫూర్తిదాయకమైన కథ దొమెనొ. దొమెనొ సినిమా ఒడిశా ప్రజలే కాకుండా యావత్ భారత దేశానికి నచ్చింది. ఇది మలేరియాతో పోరాటంలో ఒక యువ వైద్యుడి ప్రయత్నాలను చిత్రీకరించిందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అభినందించారు. ఉత్తమ ఒడియా చిత్రంగా దొమెనొ జాతీయ చలన చిత్ర అవార్డును గెలుచుకోవడం గొప్ప గౌరవమని విపక్ష నేత నవీన్ పట్నాయక్ అన్నారు. సినిమా విజయవంతం కావడానికి వెనుక ఉన్న నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, నిర్మాతలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అవార్డు గెలుచుకున్న చిత్ర యూనిట్‌కి గవర్నర్ రఘుబర దాస్ అభినందించారు. ఈ అవార్డు రజత కమలంతో రూ.2 లక్షల నగదు బహుమతిని కలిగి ఉంటుంది.

కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా



పర్లాకిమిడి: గజపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి బిజయ్‌కుమార్ పట్నాయిక్ రాజీనామా చేశారు. తన రాజీనామాను ఏఐసీసీ అధ్యక్షునికి ఈ-మెయిల్ ద్వారా శుక్రవారం పంపించారు. ఆయన 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పర్లాకిమిడి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్డీపీవో రస్మీరంజన్

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి గురుతులి గ్రామంలో లాడి సంతోష్ కుమార్ అనే వ్యక్తికి సంబంధించిన కిరాణా దుకాణంలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో జిల్లాలోని కాసీపూర్ సమితి బొడొమఝిభట్ట గ్రామానికి చెందిన ఆశిష్ నాయక్, మీనకుంటి గ్రామానికి చెందిన హేమంత్ నాయక్‌లు ఉన్నారు. నిందితుల నుంచి 11 ఇండెన్ గ్యాస్ ఖాళీ సిలెండర్లు, ఒక వెయిట్ మెషిన్, బొలేరో, ద్విచక్ర వాహనం, లూమినస్ ఇన్వర్టర్ బ్యాటరీ, టవర్ ఫ్యాన్, ఒక క్వింటాల్ బియ్యం బస్తాతో సహా మరికొన్ని కిరాణా వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించామని ఎస్డీపీవో రస్మీరంజన్ సేనాపతి వెల్లడించారు.

హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థినులు

భువనేశ్వర్: పాఠాలు బోధించి ఉత్తమ సంస్కారం నేర్పించాల్సిన ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో సస్పెన్షన్ వేటుకు గురైన సంఘటన వెలుగు చూసింది. సుందర్‌గడ్ జిల్లా బలిశంకర బాలికల ఉన్నత మాధ్యమిక పాఠశాలలో ఈ విచారకర ఘటన చోటు చేసుకుంది. సుమారు గత 2 ఏళ్లుగా ఉపాధ్యాయుడి వైఖరిపై ఈ ఆరోపణ ఉన్నట్లు సమాచారం. అతడి అసభ్య ప్రవర్తనపై విసిగిపోయిన విద్యార్థినులు శుక్రవారం రోడ్డెక్కారు. ఒకపక్క వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా నడిరోడ్డుపై బైఠాయించారు. వీరి నిరసనతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతరం జిల్లా మేజిస్ట్రేట్ చొరవతో విద్యార్థినులు ఆందోళన విరమించుకున్నారు. హెచ్‌ఎం ప్రమోద్ కుమార్ నాయక్‌ను సస్పెండ్ చేసినట్లు ప్రకటించడంతో ఆందోళనకు తెర పడింది.

'వంశధార పనులు వేగవంతం చేయాలి'

హిరమండలం: వంశధార రిజర్వాయర్ పనులు, ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం చేయాలని ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకర్ అన్నారు. వంశధార రిజర్వాయర్ (బీఆర్‌ఆర్ ప్రాజెక్టు) స్పిల్‌వే వద్ద జరుగుతున్న పనులతో పాటు జలాశయం నీటితో నింపేదుకు చేపడుతున్న ఎత్తిపోతల పథకం పనులను వంశధార ఎస్ఈ బి. రాంబాబు, డీఎస్ఏ స్వర్ణకుమార్‌లతో కలిసి శుక్రవారం పరిశీలించారు. రిజర్వాయర్ వద్ద జరుగుతున్న కాంక్రీట్, మట్టి పనులతో పాటు స్పిల్‌వే పనుల ప్రగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు కూడా పూర్తిస్థాయిలో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.

వరములివ్వు తల్లి.. వరలక్ష్మీ



రాయగడ: కొబ్బరికాయతో రూపొందించిన వరలక్ష్మీ అమ్మవారి రూపం

శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా తెలుగు లోగిళ్లు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మహిళలు వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. ముత్తైదువులకు తాంబూలాలు ఇచ్చారు. అలాగే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలుచోట్ల సామూహిక కుంకుమార్చనలు జరిపారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: పోడుగు కోవెలకు పోటెత్తిన భక్తులు



పర్లాకిమిడి: పార్వతీదేవి అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు



బ్రహ్మపురలో వరలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుంటున్న రాష్ట్ర దేవాంగ సంఘం అధ్యక్షుడు గోపి



రాయగడ: కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు



కొరాపుట్: బ్రహ్మపురలో సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు



జయపురం: నెహ్రూనగర్‌లో వరలక్ష్మీ పూజ

పోలీసుస్టేషన్ ఎదుట ఆత్మహుతికి యత్నం

భువనేశ్వర్: కటక్ జిల్లా మహంగా పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ఒక మహిళ నిప్పంటించుకుంది. దీంతో వెంటనే సిబ్బంది స్పందించి మంటలు ఆర్పి మహిళను చికిత్స కోసం కటక్‌లోని ఎస్‌సీబీ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సమాచారం ప్రకారం మహిళకు 54 శాతం కాలిన గాయాలయ్యాయి. పోలీసులు గురువారం దొంగతనం కేసులో మహిళ భర్తను పట్టుకున్నారు. తన భర్త నిర్దోషి అని పోలీసుల ఎదుట విన్నవించినా పోలీసులు తన భర్తను విడిచి పెట్టలేదు. పోలీసుల ప్రతిస్పందనతో నిరుత్సాహానికి గురైన మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించిందని వర్గాలు తెలిపాయి. ఈ కేసు విచారణ ప్రారంభించినట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

బాల నిందితుల ముఠా అరెస్ట్

కొరాపుట్: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న బాల నిందితుల ముఠాని సునాబెడా పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం రాత్రి కొరాపుట్ జిల్లా సునాబెడా పోలీస్‌స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఎస్డీపీవో మనోబ్రత సత్పతి ఈ కేసు వివరాలు ప్రకటించారు. గత నెల 20వ తేదీన సిమిలిగుడ పట్టణం గోపబంధు నగర్ మా మంగళ మందిరం, ఈనెల 1వ తేదీన సిమిలిగుడ అరబింద నగర్‌లో ప్రమెద్ కుమార్ ప్రధాన్, 7వ తేదీన సిమిలిగుడ సంతోషి మందిర్ సమీపంలో బిశ్వనాథ్ దిసారి నివాసాల్లో వరుస దొంగతనాలు జరిగాయి. వీటిపై పోలీసులు దర్యాప్తు చేయగా ఇవన్నీ బాలల చేసినట్లు గుర్తించారు. సిమిలిగుడ సమీపంలోని తులసాహికి చెందిన జిరా గుప్త అనే మహిళ ఈ దొంగతనాలుకు నేతృత్వం వహించినట్లు పేర్కొన్నారు. ఈ ముఠాకి చెందిన జిరాగుప్తతో పాటు ఐదుగురు బాలలను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.50 వేల నగదు, 200 గ్రాముల బంగారం, 200 గ్రాములు వెండి, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు.



అరెస్టైన నిందితులతో ఎస్డీపీవో మనోబ్రత సత్పతి

త్వరలో వేర్వేరు క్యాంపస్‌లు

- ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్

భువనేశ్వర్: విద్యా సంస్థల సమర్థవంతమైన నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్లస్ టూ, ప్లస్ త్రీ క్యాంపస్‌లు వేరు చేయనున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ తెలియజేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చురుకుగా కసరత్తు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్లస్ త్రీ కళాశాలల్లో విద్య నాణ్యత పెంపొందించేందుకు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న విభజన తప్పనిసరి అన్నారు. గత ప్రభుత్వం ప్లస్ త్రీ, ప్లస్ టూ శ్రేణులను వేరుచేసి ప్రత్యేక క్యాంపస్ సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. అయితే వాస్తవ కార్యాచరణకు నోచుకోలేదు. మౌలిక సదుపాయాల ఇక్కట్లతో ఇది సాధ్యం కానట్లు అనుబంధ వర్గాల సమాచారం. విభజన ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని ఉన్నత మాధ్యమిక పాఠశాలల్లో త్వరలో ప్రత్యేక క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 2016–17 విద్యా సంవత్సరంలో ప్లస్ టూని పాఠశాలలు, సామూహిక విద్యా విభాగంలో విలీనం చేశారు. ప్లస్ త్రీ యథాతథంగా ఉన్నత విద్యా శాఖలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ రెండు వర్గాల్లో విద్యార్థుల బోధన కోసం వేర్వేరు ఉపాధ్యాయ పోస్టులు సృష్టించబడ్డాయి. కానీ పోస్టుల నియామకాలు జరగలేదు. కొత్త క్యాంపస్‌ల ఏర్పాటుకు తగిన మౌలిక సదుపాయాలు మరియు బోధన కోసం అధ్యాపకులు లేకపోవడంతో నేటికీ ప్లస్ టూ మరియు ప్లస్ త్రీ శ్రేణులు ఒకే గూటి కింద ఒకే వర్గం అధ్యాపకుల బోధనతో చలామణి అవుతున్నాయి. రాష్ట్రంలో దాదాపు 787 మిశ్రమ కళాశాలలు (స్వయం ప్రతిపత్తి మరియు ప్రైవేట్) ఉన్నాయి. ఈ కళాశాలల్లో ఉన్నత మాధ్యమిక పాఠశాలలు, డిగ్రీ మరియు పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాలలు ఒకే క్యాంపస్‌లో కొనసాగుతున్నాయి. అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు మరియు అధ్యాపకులతో సర్దుకుపోతున్నాయి.

ప్రభుత్వ మద్యం షాపులో చోరీ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్డులోని బీఎస్‌ఎన్‌ఎల్ ఎక్స్ఛేంజ్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో శుక్రవారం చోరీ జరిగింది. 14వ తేదీ రాత్రి దుకాణం మూసివేసిన సమయానికి కౌంటర్‌లో రూ.రెండు లక్షల పద్నాలుగు వేల ఐదువందలు ఉండేవని ఉద్యోగులు తెలిపారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సెలవు కారణంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు తలుపులు తెరిచి చూడగా కౌంటర్‌లో కేవలం రూ.6,500 మాత్రమే నగదు మిగిలిందని తెలిపారు. దుకాణం వెనుక భాగం నుంచి తాళం పగులకొట్టి దొంగలు లోపలికి చొరబడి నగదు కాజేశారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై దృష్టి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్: సైబర్ నేరాలపై బాధితులు ఫిర్యాదు చేసిన తక్షణమే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారులకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అపరిష్కృతంగా ఉన్న కేసులపై దృష్టి కేంద్రీకరించి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో పెండింగ్, ఎన్డీపీఎస్ మద్యం, మిస్సింగ్, ప్రాపర్టీ, గ్రేవ్, సైబర్ వంటి నేరాలకు సంబంధించి కేసులపై ఎస్పీ నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసుల్లో నిశితమైన సాక్ష్యాధారాలతో సమగ్ర దర్యాప్తు చేసి చార్జిషీటు కోర్టులో దాఖలు చేయాలని, హోంగార్డు, పీసీల నుంచి డీఎస్పీ స్థాయి వరకు తప్పనిసరిగా గ్రామ సందర్శనలు చేసి ప్రజలతో మమేకమై సమస్యలు గుర్తించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను గుర్తించి ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు.

గంజాయి నియంత్రించాలి..

గంజాయి నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఇలాంటి కేసుల్లో అరెస్టయిన నిందితుల నుంచి వారికి అమ్మిన, సరఫరా చేసిన వ్యక్తుల సమాచారాన్ని సేకరించి, ఆయా కేసుల్లో వారిని నిందితులుగా చేర్చాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. జైలు నుంచి విడుదలైన ముద్దాయిలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాల్లో ఫిర్యాదుదారుడు ఇచ్చిన వివరాల మేరకు దర్యాప్తు వేగవంతం చేయాలని, ప్రజలకు తక్షణమే ఫిర్యాదు చేసేలా (ఆన్‌లైన్ పోర్టల్, డయల్ 1930, పరిధి పీఎస్‌లో ఎఫ్ఐఆర్ నమోదు, ఖాతా కలిగిన బ్యాంకు ప్రతినిధులతో సంప్రదింపు) అవగాహన కల్పించాలన్నారు. పాత నేరస్తుల కదలికలపైనా దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ డాక్టర్ ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు శృతి, బాలచంద్రారెడ్డి, త్రినాధరావు, శ్రీనివాసరావు, ఏవో గోపినాథ్, లీగల్ అడ్వైజర్ హేమని, సీసీ శివకుమార్, పీఆర్వో భాస్కర్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

బీఎంసీ కార్పొరేటర్ రాజీనామా



బందితా పాల్

భువనేశ్వర్: నగర పాలక సంస్థ 37వ నంబర్ వార్డు కార్పొరేటర్ బందితా పాల్ రాజీనామా చేశారు. పదవితో పాటు బిజూ జనతా దళ్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు శుక్రవారం ప్రకటించారు. స్థానిక నగర పాలక సంస్థ ఎన్నికల్లో ఆమె స్వతంత్ర అభ్యర్థి గా గెలిపొందిన తర్వాత బీజేడీలో చేరారు. ప్రస్తుత రాజకీయ కారణాలతో బీజేడీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. అనంతరం ఆమె బీజేపీలో చేరారు.

కాంగ్రెస్ మీడియా అధికార ప్రతినిధుల నియామకం

భువనేశ్వర్: రాష్ట్ర కాంగ్రెస్‌లో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ తరఫున మీడియాతో స్పందించేందుకు నలుగురు కొత్త అధికార ప్రతినిధులను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) శుక్రవారం నియమించింది. ఈ జాబితాలో కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడు రామచంద్ర కదమ్, సీనియర్ నాయకుడు సంతోష్ సింగ్ సలూజా, శ్రీకాంత జెనా మరియు బిశ్వ రంజన్ మహంతి ఉన్నారు. 2019 జనవరి 19న మీడియాతో అనధికారికంగా మాట్లాడినందుకు శ్రీకాంత్ జెనాను కాంగ్రెస్ నుంచి బహిష్కరించారు. తిరిగి 2024 మార్చి 6న ఆయన కాంగ్రెస్‌లో చేరారు.

పీసీసీ చీఫ్ రేసులో శ్రీకాంత్

ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి శ్రీకాంత్ జెనా ప్రధాన పోటీదారుగా ఉన్నట్లు సంకేతాలు బలపడుతున్నాయి. తాజా నియామకం ఈ ఊహాగానాలను మరింత బలపరుస్తోంది. కాగా ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా విభాగం ప్రముఖునిగా పాత్ర వహించిన బిజయ్‌కుమార్ పట్నాయక్ శుక్రవారం రాజీనామా చేశారు. ఆయన 2023 ఫిబ్రవరి 10న కాంగ్రెస్‌లో చేరారు. 18 నెలల స్వల్ప వ్యవధిలో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శిగా విరామం పొందిన తర్వాత ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగిడారు.

అమిత్ రోహిదాస్‌కు సీఎం సత్కారం

భువనేశ్వర్: పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించి స్వరాష్ట్రానికి తిరిగి వచ్చిన ఒడిశా హాకీ స్టార్ అమిత్ రోహిదాస్‌ను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ శుక్రవారం సత్కరించారు. భారత పురుషుల హాకీ జట్టు కాంస్య పతకాన్ని గెలుచుకోవడంలో అమిత్ కీలక పాత్ర పోషించాడు. రోహిదాస్ అపారమైన సహకారంతో వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ బంగారు పతకాన్ని సాధించగలదని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. రోహిదాస్ యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. అంతర్జాతీయ ఈవెంట్లలో భారత్ మరిన్ని పతకాలు పొందేలా ఒడిశా ప్రభుత్వం హాకీకి పెద్దపీట వేస్తూ మద్దతునిస్తుందన్నారు. అంతకుముందు భువనేశ్వర్ చేరుకున్న రోహిదాస్‌కు ఘన స్వాగతం లభించింది. ఒడిశా నుంచి ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జట్టులో ఏకైక ఆటగాడు రోహిదాస్‌ను, పారిస్‌లో విజయంలో కీలకపాత్ర పోషించినందుకు పలు సంస్థలు సత్కరించాయి.



అమిత్ రోహిదాస్‌ను సత్కరిస్తున్న సీఎం మోహన్‌చరణ్

ఘన స్వాగతం

సుందర్‌గడ్ జిల్లాలోని సౌనమారా గ్రామానికి చెందిన రోహిదాస్‌ను భువనేశ్వర్‌లోని బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ) చేరుకున్న సందర్భంగా అభిమానులు, కుటుంబ సభ్యులు మరియు అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం రోహిదాస్‌కు రూ.4 కోట్ల నగదు బహుమతిని ప్రకటించగా, భారత హాకీ జట్టు ఆటగాళ్లకు ఒక్కొక్కరికీ రూ.15 లక్షలు మరియు సహాయక సిబ్బందికి ఒక్కొక్కరికీ రూ.10 లక్షలు చొప్పున నగదు పురస్కారం ప్రకటించిన విషయం తెలిసిందే. పారిస్‌లో భారతదేశ విజయంలో కీలక పాత్ర పోషించిన రోహిదాస్, తన పతకాన్ని ఒడిశా ప్రజలకు అంకితం చేసినట్లు ప్రకటించాడు. మీడియాతో మాట్లాడిన అమిత్.. భవిష్యత్తులో హాకీని కొత్త శిఖరాలకు తీసుకెళ్తానని ఆత్మ విశ్వాసం వ్యక్తం చేశాడు.

సంక్షిప్తంగా...

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం సభ్యులు

కొరాపుట్/పర్లాకిమిడి: బ్రహ్మపుర ప్రెస్‌క్లబ్‌కి నూతన కార్యవర్గం ఏర్పాటు అయింది. నూతన అధ్యక్షుడిగా అశోక్ బ్రహ్మ, ఉపాధ్యక్షుడిగా అభయ్ కుమార్ పాఢీ, సాధారణ కార్యదర్శిగా ప్రహ్లాద్ సాహు, సంయుక్త కార్యదర్శిగా గోపాల్ కృష్ణ రెడ్డి, కోశాధికారిగా శివ నారాయణ పండాలు గెలిపొందారు. బ్రహ్మపుర తాహసీల్దార్ కిరోద్ బిహారి నాగ్ ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షించారు.

ఎంకేసీజీ సందర్శన



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్

కొరాపుట్: బ్రహ్మపుర పట్టణంలోని ఎంకేసీజీ ప్రభుత్వ వైద్య కళాశాలని బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమర్ ఆకస్మికంగా సందర్శించారు. పట్టణంలోని మహారాజ కృష్ణచంద్ర గజపతి మెడికల్ కళాశాలలో అన్ని వార్డులను శుక్రవారం కలియతిరిగారు. 1966 నుంచి నడుస్తున్న ఈ కళాశాలలో అనేక సమస్యలు ఉన్నాయి. ఎమ్మెల్యే నేరుగా రోగులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఒక రోగి బంధువు అక్కడి సమస్యలపై ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేయడంతో తరలివచ్చారు. డాక్టర్ల భద్రత, రోగుల మంచాలు, వైద్యం, రోగి సహాయకులపై సిబ్బంది నిర్లక్ష్య వైఖరిపై పరిశీలన జరిపారు. అనంతరం వైద్యులతో మాట్లాడి ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.

చొరబాటుదారులను అడ్డుకోండి

కొరాపుట్: బంగ్లాదేశ్ నుంచి కొరాపుట్ జిల్లాకు వచ్చే చొరబాటుదారులను అడ్డుకోవాలని కొరాపుట్ జిల్లా కేంద్రంలో హిందూ పరివార్ సంస్థలు భారీ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. జిల్లాలో అనుమానిత బంగ్లా దేశీయులను గుర్తించాలని, వారి కోసం గాలింపులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఒక వినతిపత్రం కలక్టరేట్‌కి అందించారు. ఆందోళనలో విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్, హనుమన్ శోభా యాత్ర కమిటీ తదితర సంస్థలు పాల్గొన్నాయి.



ఆందోళన చేస్తున్న దృశ్యం

డ్రెయిన్ నిర్మించాలని ఆందోళన

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి వంశధార నదీ పరివాహక ప్రాంతంలో నివాసముంటున్న బూదర గ్రామస్తులు తమ గ్రామంలో డ్రెయిన్ నిర్మించాలని కోరారు. ఈ మేరకు పర్లాకిమిడి రోడ్లు భవనాలశాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయానికి శుక్రవారం వెళ్లి సెక్షన్ అధికారికి వినతిపత్రం అందజేశారు.

కట్టడాలను పరిరక్షించండి



మంత్రి సూర్యవంశీకి వినతిపత్రం ఇస్తున్న రిక్కి త్రిపాఠి తదితరులు

కొరాపుట్: బ్రిటిష్ వారి సమయం నుంచి ఉన్న కట్టడాలను పరిరక్షించాలని దివంగత ముఖ్యమంత్రి సదాశివ త్రిపాఠి వారసులు కోరారు. ఈ మేరకు శుక్రవారం నబరంగ్‌పూర్ జిల్లా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి సూరజ్ సూర్యవంశిని కలిశారు. 1942లో స్వాతంత్ర్య సమరయోధులను ఖైదీలుగా చేసి ఉంచిన జైలు నేడు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని తాహసీల్దార్ కార్యాలయం వెనుక ఉందన్నారు. ఆ జైలును స్మారక కేంద్రంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇంద్రావతి నదిపై బ్రిటిష్ వారు నిర్మించిన ఇనుప వంతెనను పరిరక్షించాలన్నారు. వారి విజ్ఞప్తి విన్న మంత్రి ఆ జైలుని సందర్శించారు. మంత్రితో పాటు నబరంగ్‌పూర్ కలెక్టర్ డాక్టర్ శుబంకర్ పాత్రో, నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మజ్జి, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర మజ్జి, మున్సిపల్ చైర్మన్ కును నాయక్ తదితరులు ఉన్నారు.

దాడులు అరికట్టాలి

పర్లాకిమిడి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ గజపతి జిల్లా భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ శ్రేణులు స్థానిక రాజవీధి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. గజపతి జిల్లాలో చొరబాట్లుపై దర్యాప్తు చేయాలని, వారికి దొడ్డిదారిన ఆధార్, రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నవారిని జిల్లా నుంచి బహిష్కరించాలని కోరారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ ప్రాణకృష్ణ పాణిగ్రాహికి వినతిపత్రం అందజేశారు.



ర్యాలీ చేపడుతున్న భజరంగ్ దళ్, వీహెచ్‌పీ శ్రేణులు

స్వర్గ రథం ప్రారంభం



జెండా ఊపి రథం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్: లక్ష్మీపూర్ ప్రాంతంలో మృతుల కుటుంబాలకు కష్టాలు తీరాయి. శుక్రవారం కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి కేంద్రంలో కాంగ్రెస్‌కి చెందిన లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత జెండా ఊపి స్వర్గరథం ప్రారంభించారు. వేదాంత పరిశ్రమ ఆర్థిక సాయంతో ఈ వాహనం సమకూరింది.

ప్రశాంతంగా ముగిసిన బంద్



రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

మల్కన్‌గిరి: జిల్లాలో శుక్రవారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని కోరుతూ శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి బంద్ చేపట్టారు. బంగ్లాదేశ్‌లోకి వచ్చిన చొరబాటుదారులను గుర్తించి తరిమికొట్టాలన్నారు.

క్లుప్తంగా

కరాటే పోటీల్లో ఆకాష్ ప్రతిభ



తల్లిదండ్రులతో ఆకాష్

గజపతినగరం: హైదరాబాద్‌లో ఈ నెల 4న జరిగిన జాతీయ స్థాయి కరాటే కుంగ్‌ఫు ఓపెన్ చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో గజపతినగరానికి చెందిన ఏడో తరగతి విద్యార్థి గజ్జెల ఆకాష్ సత్తా చాటాడు. పోటీల్లో ఆకాష్ బంగారు పతకాన్ని సాధించాడు. ఆకాష్‌ను పలువురు అభినందించారు.

నేడు వికసిత ఆంధ్రాపై శిక్షణ

పార్వతీపురం: వికసిత ఆంధ్రా కార్యక్రమంపై శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రణాళికాధికారి పి.వీర్రాజు శుక్రవారం తెలిపారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పాల్గొనే కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరు కావాలని కోరారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు



బాడంగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు సత్యనారాయణ

బాడంగి: మండలంలోని రామచంద్రాపురం – పాల్తేరు జంక్షన్ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. బాడంగి మండలంలోని కోడూరుకు చెందిన రైతు సత్యనారాయణ శుక్రవారం తన స్కూటీపై వెళ్తూ.. పాల్తేరు జంక్షన్ వద్ద మలుపు వైపు తిరుగుతుండగా తెర్లాం మండలం పాములవలస గ్రామానికి చెందిన కొన్న సునీల్ తన వాహనంపై బాడంగి వస్తూ ఇద్దరూ ఢీకొన్నారు. దీంతో గాయపడిన ఇద్దరిని 108 వాహనంపై స్థానిక సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. సత్యనారాయణకు కుడి చేయి, వెన్నెముకకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. తమకు ఎటువంటి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

సాలూరు రూరల్: మండలంలోని వెంగళరాయ సాగర్ డ్యాంలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమయినట్లు రూరల్ ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు... శుక్రవారం పోలీసులకు అందిన సమాచారం మేరకు గుర్తు తెలియని పురుషుడి మృతదేహం (40) లభ్యమైంది. మృతుడు బ్లూ కలర్ జీన్ ప్యాంట్, కుంకుమ రంగు షర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గుర్తు పడితే 91211 09472 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం



సురేష్(ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి – పెదమానాపురం మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని బల్దిరెడిసురేష్(26) అనే యువకుడు మృతి చెందినట్లు బొబ్బిలి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఈశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. పెదమానాపురానికి చెందిన మృతుడి తల్లిదండ్రులు బంగారునాయుడు, రమణమ్మ కూలి పనుల కోసం వలసపోయి తాడేపల్లిగూడెంలో కొన్నాళ్లుగా ఉంటున్నారు. మృతుడు సురేష్ నాన్నమ్మ ఇంటికి శుక్రవారం వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రెవెన్యూ రికార్డుల తనిఖీ

శృంగవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్.పి.సిసోడియా రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రికార్డులను తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఎస్.కోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని అక్కడి రికార్డులను తనిఖీ చేశారు. వేపాడ మండలానికి చెందిన కొన్ని భూముల రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ఎస్.కోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో భూముల కొనుగోలు, రిజిస్ట్రేషన్ వ్యవహారంలో అవకతవకలు జరిగాయన్న విమర్శలు ఉన్నాయి.

అంతా.. 'అధికారం' కనుసన్నల్లోనే...

- ఇల్లు కట్టుకునే వారికి కాకుండా కంపెనీలకు ఇసుక సరఫరా
- బొబ్బిలిలో టన్ను ఇసుక రూ.605లు, విశాఖలో టన్ను ఇసుక రూ.2800లు
- తిలా పాపం తలా పిడికెడులా ఇసుక అక్రమ విక్రయాలు

బొబ్బిలి:

స్థానిక గ్రోత్ సెంటర్‌లోని ఇసుక స్టాక్ పాయింట్‌లో కూటమి ప్రభుత్వం ప్రకటించిన టన్ను ఇసుక ధర రూ.605లు. విశాఖలో ఇదే ఇసుకను రూ.2,800లు పైచిలుకు విక్రయిస్తున్నారు. ఈ లాభాలకు అలవాటు పడిన విశాఖ లారీలు ఇక్కడ నుంచి కదలడం లేదు. ఏదైనా సమస్య వస్తే రాజకీయంగా పైరవీలు చేసుకుని ఇసుకను తరలిస్తున్నారు. సుమారు లక్ష టన్నుల ఇసుకలో ఇప్పటికే సగం ఖాళీ అయిపోయింది. మిగతా ఇసుక కూడా తీసుకెళిపోతే ఇక మేం ఎక్కడి నుంచి తెచ్చుకుంటామని స్థానికులు, మా ట్రాక్టర్లకు మరేం పని ఉంటుందని వాహనాల యజమానులు, డ్రైవర్లు బావురుమంటున్నారు. ఎందుకంటే ఇసుక రీచ్‌లు ప్రారంభించాలంటే వర్షాకాలం పోవాలి. అంటే దాదాపు మరో మూడు నెలలు రీచ్‌లు ప్రకటించరు. అంత వరకూ ఇక్కడి ఇసుక ఉండదని వారి అనుమానం.

అంచనాతోనే ఇసుక లోడ్లు

పొక్లెయినర్ బకెట్‌తో ఓ సారి వేస్తే టన్నున్నరగా అధికారులు లెక్క గడుతున్నారు. కానీ ఇక్కడి వెయింగ్‌మెషీన్‌ను మరమ్మతు చేయించడం లేదు. ఇంతకీ మెషీన్ పాడయిందా లేక అలా చెబుతున్నారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. 13న్నర బకెట్లు వేస్తే 20 టన్నులు వేసినట్టు లెక్క వీరికి మాన్యువల్ రశీదులు ఇస్తూ అమౌంట్ మాత్రం ఫోన్‌పేలో తీసుకుంటున్నారు. అలాంటప్పుడు ఆన్‌లైన్ బిల్లులు ఎందుకు ఇవ్వడం లేదన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోతున్నది.

ఒకే బిల్లుతో అధిక లోడ్లు

బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఉన్న రెండు ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలకు 26 టన్నుల లెక్కన ఇసుకను ఒకే లోడులో పంపిస్తున్నారు. ఇసుక స్టాక్ పాయింట్ వద్ద వెయింగ్ మిషన్ లేకపోవడంతో ఇష్టారీతిన వాహనాలు ఒకే వే బిల్లుతో పలు దఫాలు తిరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కానీ కంపెనీలు మాత్రం ఎంత బరువు ఉందో బిల్లు చూపిస్తాయి కదా! ఈ రకంగా కంపెనీలకు తరలిన వాహనాలు అక్కడి వెయింగ్ మెషీన్‌లో తూకం వేసి ఇచ్చిన బిల్లులలో 26 నుంచి 30 టన్నుల వరకూ వస్తున్నాయి. గ్రోత్ సెంటర్‌లోనే ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ నుంచి అక్కడే ఉన్న కంపెనీలకు ప్రయాణం కేవలం పావు గంట మాత్రమే పడుతుంది. దీంతో ఒకే వే బిల్లుతో పలు దఫాలు ఇసుక తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో ఆపరేటర్లు, అక్కడి సిబ్బంది పాత్ర ఉందని స్థానిక వాహన యజమానులు ఆరోపిస్తున్నారు.

పని చేయని వేదిక


ఇసుకను ఇతర జిల్లాల వారు తరలించుకుంటున్నారని కూటమి ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానికులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. ఉచిత ఇసుక అంటూ ఇదేం దోపిడీ అని బహిరంగంగా ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు పరిశీలించినా పట్టించుకోకపోవడం దారుణమని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఆర్డీఓ ఆఫీసుకు తోవ లేకుండా..

గ్రోత్‌సెంటర్‌లో ఉన్న ఆర్డీఓ ఆఫీసలకు వెళ్లేందుకు తోవ లేకుండా రోడ్లపై లారీలను నిలిపి ఉంచేశారు. దీనిని కూడా అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లే దారిలో నిలిచి ఉన్న విశాఖ లారీల పక్క నుంచే ఆర్డీఓ సిబ్బంది వెళ్లడం శోచనీయం.



మరమ్మతులు చేయించని వెయింగ్ మెషీన్



ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలో అన్‌లోడ్ అయిన బిల్లులో 26 టన్నులు చూపిస్తున్న లారీ ఇసుక బరువు

- ఈ ఆన్‌లైన్ బిల్లు చూశారా? ఇది గ్రోత్‌సెంటర్‌లోని ఓ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలో బొబ్బిలి ఇసుక స్టాక్ పాయింట్ నుంచి వెళ్లి అన్‌లోడ్ అయిన ఇసుక బరువు 26 టన్నులుగా స్పష్టంగా సూచిస్తున్నది. గ్రోత్ సెంటర్‌లోనే ఉన్న కంపెనీకి అక్కడే ఉన్న స్టాక్ పాయింట్ నుంచి ఒకటి రెండు లారీలను పక్క గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే బేబీ నాయన పేరు చెప్పుకుని ఇసుక రవాణాకు కుదుర్చుకున్నారు. అయితే వారికి మాత్రం ఎక్కువ లోడు వేసి తరలిస్తున్నారన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఒక వ్యక్తికి రోజుకు 20 టన్నులు మాత్రమే ఇస్తున్నామంటున్న అధికారులు కూటమి నాయకుల ఆదేశాలతో నిబంధనలను పట్టించుకోవడం లేదు. కనుకే ఈ లోడ్లు 26 నుంచి 28 టన్నుల పైగా తరలిస్తున్నారు. కాసులు సంపాదిస్తున్నారు.



లారీలకు లోడవుతున్న ఇసుక

☛ ఈ చిత్రంలోని లారీలను చూడండి! బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఉన్న ఇసుక ముందుగా స్థానికుల అవసరాలకు మాత్రమే ఇస్తాం. ఆ తరువాత జిల్లా వాసులకు, ఆ తరువాత పార్వతీపురం మన్యం జిల్లా వాసులకు ఇచ్చాక మిగతా జిల్లాలకు ప్రాధాన్యమిస్తాం. ముందుగా ఇక్కడి నుంచి ఇసుక లారీలను తరలించండని మైన్స్ విజిలెన్స్ ఏడీ, బొబ్బిలి ఆర్డీఓ, తహసీల్దార్‌లు ఆదేశించారు. కానీ కూటమి నాయకుల పైరవీలు ఉండటంతో ఇక్కడి ట్రాక్టర్లకు కానీ, నాటుబళ్లకు కానీ అవకాశాలు లేకుండా కేవలం లారీలకు విశాఖపట్నం తదితర జిల్లాలకు తరలిస్తున్నారు. విశేషమేమంటే లారీల యజమానులు, డ్రైవర్లు, సిబ్బంది అంతా గ్రోత్ సెంటర్‌లోని రోడ్లను ఆక్రమించి అక్కడే వంటా వార్పూ చేసుకుని ఇసుక నింపుకున్నాకే వెళ్తున్నారు.



ఆర్డీఓ కార్యాలయ రహదారిలోనే వంటా వార్పు చేసుకుంటున్న విశాఖ లారీల సిబ్బంది

ఫిర్యాదు చేసినా..



గ్రోత్ సెంటర్‌లో మా ట్రాక్టర్‌లకు చోటివ్వడం లేదు. పెద్ద లోడ్లతో విశాఖ తరలించుకుపోతున్నారు. మాకు చాలా ఆలస్యం చేస్తున్నారు. ఈ విషయమై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. కానీ చర్యలు లేవు. బిల్లు మొత్తం కన్నా ఎక్కువ ఇసుక తరలిస్తున్నారు.

– తాడ్డి ఈశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు, బొబ్బిలి

వెయింగ్ మెషీన్ పని చేయడం లేదు

ఇక్కడి వెయింగ్ మెషీన్‌ను మైన్స్ అధికారులు మరమ్మతులు చేయిస్తామన్నారు. కానీ చేయలేదు. త్వరలో ఏర్పాటు చేస్తారు. వారికి సమాచారమిచ్చాం. సీసీ కెమెరాలలో ఓ మూడు పని చేస్తున్నాయని తెలిసింది. చర్యలు తీసుకుంటాం.

– ఎం.శ్రీను, తహసీల్దార్

రోగులను రిఫర్ చేస్తే సహించేది లేదు...



వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

- ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరగాలి
- త్వరలోనే వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తి
- మంత్రి శ్రీనివాస్

గజపతినగరం రూరల్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులను రిఫర్ చేస్తే ఊరుకునేది లేదని స్కిల్ డవలప్‌మెంట్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు నమ్మకం కలిగేలా వైద్య సేవలు ఉండాలన్నారు. గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన వైద్యులతో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగికి చిన్నపాటి రోగమైనా జిల్లా కేంద్ర ఆస్పత్రికో.. విశాఖ కేజీహెచ్‌కో రిఫర్ చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఇకనైనా రోగులను రిఫర్ చేయడం మానుకొని ఇక్కడే వైద్యం అందించేలా చూడాలని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీష్ మాట్లాడుతూ ఆస్పత్రి నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల రోగుల తాకిడికి తగినట్టు మంచాలు లేకపోవడం, పలు వైద్య పరికరాలు వినియోగంలోకి తీసుకురాలేక స్టోరేజీకే పరిమితమవుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత కూడా ఉండడంతో పూర్తి స్థాయిలో రోగులకు సేవలను అందించడం కష్టమవుతున్నారు సమస్యలు విన్న మంత్రి శ్రీనివాస్ ఆస్పత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా దృష్టి సారిస్తామన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

పార్వతీపురం ఎస్‌డీపీఓ బదిలీ



సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సునీల్ షియరన్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సునీల్ షియరన్‌కు గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా బదిలీ చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన స్థానంలో ఎస్ అంకిత మహావీర్ ఎస్‌డీపీఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో పార్వతీపురంలో ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించడంలో సునీల్ షియరన్ కీలక పాత్ర పోషించారు.

హత్య కేసును చేధించిన పోలీసులు

- నిందితురాలి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- చోరీ చేసిన 14.5 తులాల బంగారు ఆభరణాలు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందల్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: లాభాపేక్షతో మహిళను హత్య చేసి, ఆమె శరీరంపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుపోయిన కేసులో నిందితురాలిని జిల్లా పోలీసులు నాలుగు రోజుల్లో అరెస్ట్ చేశారు. ఆమె నుంచి చోరీ సొత్తును రికవరీ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. బాడంగి గ్రామం ముగడ కాలనీలో నివాసం ఉంటున్న గెద్ద కృష్ణవేణి అనే వృద్ధురాలు ఇంట్లో చనిపోయినట్లు, ఆమె శరీరంపై ఉన్న బంగారు ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోయినట్లుగా పాలకొండ పట్టణంలో నివాసం ఉంటున్న వృద్ధురాలి చిన్న కుమారుడు గెద్ద నాగేంద్ర కుమార్ ఫిర్యాదు చేశాడు. బాడంగి పోలీసులు లాభాపేక్ష హత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలు కృష్ణవేణి భర్త నారాయణప్పల నాయుడు హెచ్ఎంగా పని చేసి 2018లో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె ముగడ కాలనీలోనే ఒంటరిగా నివాసం ఉంటున్నారు. మృతురాలి పెద్ద కుమారుడు హరికృష్ణబాబు వృత్తి రీత్యా కుటుంబంతో విశాఖలోనూ, చిన్న కుమారుడు నాగేంద్ర పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో నివాసం ఉంటున్నారు. ఇద్దరూ అప్పుడప్పుడు తన తల్లివద్దకు వచ్చి, ఆమె యోగక్షేమాలు చూసుకుని, అవసరమైన మందులు కొని ఇచ్చి వెళ్లిపోయేవారు. ఈ క్రమంలో ఆగస్టు 11న కాలనీలో ఉంటున్న తన తల్లి కృష్ణవేణి ఇంటి నుంచి గ్యాస్ వాసన వస్తున్నట్లు, తలుపులు తెరిచి చూసేసరికి ఇంట్లో చనిపోయి ఉన్నట్లు, ఆమె శరీరంపై ఉన్నటువంటి బంగారు ఆభరణాలు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోయారని, అదే గ్రామంలో ఉంటున్న తెంటు లక్ష్మి పాలకొండలో ఉంటున్న మృతురాలి కొడుకు నాగేంద్రకు ఫోన్ చేసి, సమాచారం అందించింది. అతను సంఘటనా స్థలానికి వచ్చి తన తల్లి చనిపోయినట్లు నిర్ధారించుకుని బాడంగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హత్యానేరం, దొంగతనం కేసుగా నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా మృతురాలు కృష్ణవేణి ఇంటికి ఎదురుగా కొంతకాలంగా కలిశెట్టి లలితకుమారి అనే మహిళ నివాసం ఉంటూ, 20 రోజుల క్రితం ఇల్లు ఖాళీ చేసి, విశాఖ కంచరపాలెంకు వెళ్లిపోయినట్టు గుర్తించారు. తర్వాత ఆగస్టు 11న కాలనీకి వచ్చి, ఒంటరిగా నివాసం ఉంటున్న కృష్ణవేణిని హత్య చేసి ఆమె శరీరంపై ఉన్నటువంటి సుమారు 14.5 తులాల బంగారు ఆభరణాలు దోచుకుని వెళ్లిపోయినట్లు సాంకేతిక పరిజ్ఞానంతో, సాక్ష్యాధారాలు సేకరించినట్లు ఎస్పీ తెలిపారు. బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బొబ్బిలి సీఐ ఎం.నాగేశ్వరరావు, సీసీఎస్ సీఐ ఎ.సత్యనారాయణ, సిబ్బంది సంయుక్తంగా బృందాలుగా ఏర్పడి, నిందితురాలిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామన్నారు. నిందితురాలు లలితకుమారిని బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అరెస్టు చేసి, విచారణ చేయగా తనకు డబ్బులు అవసరమై గెద్ద కృష్ణవేణిని చున్నీతో గొంతు బిగించి, హత్యచేసి, ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు గాజులు, ఉంగరాలు, గొలుసులు, పుస్తెల తాడు, కాసుల పేరు, చెవిదిద్దులు, శతమానం, మంగళసూత్రం తీసుకుని పరారైనట్లు నేరం అంగీకరించారని ఎస్పీ తెలిపారు. నిందితురాలి నుంచి బంగారు గొలుసు స్వాధీనం చేసుకుని, మిగిలిన వస్తువులను విశాఖ కంచరపాలెంలో తాను నివాసం ఉంటున్న ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ నాగేశ్వరరావు, బాడంగి ఎస్ఐ జయంతి, సీసీఎస్ సీఐ భాగ్యం, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్‌బీ సీఐలు కెకెవి.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సూత్రధారులను.. ప్రధాన నిందితులుగా చేర్చుతాం

- గంజాయి అక్రమ రవాణాపై డేగ కన్ను.. 5 చెక్‌పోస్టులు ఏర్పాటు
- రామభద్రపురంలో 20 కిలోల గంజాయి స్వాధీనం
- బొబ్బిలిలో 16కిలోల గంజాయి స్వాధీనం, 8మంది అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్:

గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు చేపడుతున్న ప్రధాన సూత్రధారులను గుర్తించి వారిని కేసుల్లో నిందితులుగా చేర్చడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో రామభద్రపురం పీఎస్ పరిధిలో 20 కిలోల గంజాయి కేసును, బొబ్బిలి పీఎస్ పరిధిలో 16 కిలోల గంజాయి సీజ్ కేసు వివరాలు వెల్లడించారు. రామభద్రపురం కొట్టక్కి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు సమీపంలో ఎస్ఐ జ్ఞానప్రసాద్, సిబ్బంది వాహన తనిఖీలను శుక్రవారం నిర్వహిస్తున్నారు. ఓడీ 08వీ 5769 నెంబర్ గల బైక్‌సీట్‌లో స్పాంజ్‌కు బదులుగా గంజాయిని కుక్కి ఒడిశా రాష్ట్రం సుంకి నుంచి రాయగడకు తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం కలహండి జిల్లా అంపని పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన హరప్రసాద్ హంస అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. బైక్‌తో పాటూ బైక్‌లో దొరికిన 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. హరప్రసాద్ ఎవరి వద్ద కొనుగోలు చేశాడన్న కోణంలో విచారణ చేపట్టారు. ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా గురసేతు గ్రామానికి చెందిన జినుపంగి అనే వ్యక్తి అతనికి గంజాయి సరఫరా చేసినట్లు, ఇందుకు మధ్యవర్తిగా అదే రాష్ట్రానికి చెందిన పతి సిగోల్ అనే వ్యక్తి వ్యవహరించినట్లు తెలిపారు. కేసులో వారిద్దరినీ నిందితులుగా చేర్చామని, త్వరలోనే మిగతా వారిని అరెస్ట్ చేస్తామని తెలిపారు. అదేవిధంగా బొబ్బిలి పట్టణంలోని ఆర్‌సీఎం స్కూల్ వెనుక ఉన్న బరియల్ గ్రౌండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఎనిమిది మంది వ్యక్తులు పోలీసులను చూసి పరారీ అయ్యేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వీరిలో కర్ణాటక రాష్ట్రం తమకూరు జిల్లా నాగలాపురానికి చెందిన నాగలాపురం లోహిత్ అలియాస్ లోహిత్ భరత్ (ఎ1), బొబ్బిలికి చెందిన చింతాడ సారధి అలియాస్ నాని అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చాడన్నారు. నాలుగు కిలోల గంజాయిని లోహిత్ నుంచి ఆరు కిలోలు సారధి నుంచి బొబ్బిలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. బొబ్బిలికి చెందిన సిమిడి ప్రేమ్‌కుమార్, లంక నిఖిల్, దేవుపల్లి చందన్ అలియాస్ బంజూ అనే వ్యక్తులు ఒడిశా నుంచి వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి, తీసుకువచ్చి చింతాడ సారధికి అందజేసి, వ్యాపారంలో సహాయపడేవారన్నారు. వీరితో పాటూ ముగ్గురు జువినల్స్ అక్రమంగా గంజాయి తరలించడంలో సహకరించేవారని, వారిని కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన మిగిలిన నిందితుల నుంచి మరో ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. అరెస్ట్ అయిన వారిపై సస్పెక్ట్ షీట్‌లు తెరుస్తామని, వారిపై నిఘా ఉంచుతామన్నారు. సమావేశంలో బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ ఎం.నాగేశ్వరరావు, ఎస్‌బీ సీఐలు కెకెవి.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, రామభద్రపురం ఎస్ఐ జ్ఞానప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి కేసులో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

పరిశోధనలపై యువత దృష్టి సారించాలి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సెంచూరియన్‌లో కుట్టు యంత్రాల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

నెల్లిమర్ల రూరల్: పరిశోధనలపై యువత దృష్టి సారించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో కుట్టు యంత్రాల శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు అవసరమైన నైపుణ్యాలు నేర్చుకోవడానికి తగిన సౌకర్యాలు వర్సిటీలో ఉన్నాయని, భవిష్యత్తులో కలిసి పనిచేద్దామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమరావతిలో నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని, అవసరమైన సహకారం అందించాలన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను సందర్శించి అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, వీసీ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్లు ప్రొఫెసర్ రమణారావు, సన్నీ డయోల్, ఎంఎల్ఎన్ ఆచార్యులు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైద్య సేవలు నిలిపివేత

- వైద్య సిబ్బందికి కేంద్రం రక్షణ చట్టం చేయాలి
- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయ చంద్రనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జయచంద్రనాయుడు

విజయనగరం ఫోర్ట్: కోల్‌కత్తాలో ఆర్.జి.కర్ ప్రభుత్వాస్పత్రిలో ఈ నెల 9వ తేదీ రాత్రి డ్యూటీలో ఉన్న వైద్య విద్యార్థినిపై అమానుషంగా సాముహిక అత్యాచారంచేసి పాశవికంగా హత్య చేసిన కేసులో సత్వర న్యాయం చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముర్రు జయచంద్రనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రౌడీ మూకల దాడులను నిరసిస్తూ జాతీయ ఐఎంఏ, ఏపీ ఐఎంఏ శాఖలు శనివారం 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విజయనగరం ఐఎంఏ శాఖ కూడా శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం 6 గంటల వరకు నగరంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో అత్యవసర సేవలు మినహాయించి, ఓపీ సేవలు, అత్యవసరం కాని శస్త్రచికిత్సలు నిలిపివేస్తామన్నారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి సీబీఐ ఆధ్వర్యంలో త్వరితగతిన నేరపరిశోధన పూర్తిచేయాలన్నారు. నేరానికి పాల్పడిన వారిపై కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు. సమావేశంలో ఐఎంఏ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, జిల్లాశాఖ అధ్యక్షుడు డాక్టర్ అశోక్, కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ సునీల్, డాక్టర్ మధుకర్, తదితరులు పాల్గొన్నారు.